# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 09-07-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. రాబోయే ఐదేళ్లలో భారతదేశాన్ని మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుస్తామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.**

**2. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన వెలగపూడి సచివాలయంలో రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం జరుగుతోంది.**

**3. ఉపాధ్యాయ అర్హత పరీక్ష.. టెట్ షెడ్యూల్‌ను మార్పు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.**

**4. దేశంలో ఖరీఫ్ సాగు విస్తీర్ణం గత ఏడాదికంటే 14.10 శాతం పెరిగిందని కేంద్ర వ్యవసాయశాఖ వెల్లడించింది.**

**5. రాష్ట్రంలో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు ఈరోజు కురిసే అవకాశముందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.**

==========================

రాబోయే ఐదేళ్లలో భారతదేశాన్ని మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుస్తామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. రష్యా పర్యటనలో భాగంగా ఆ దేశ రాజధాని మాస్కోలో ప్రవాస భారతీయులను ఉద్దేశించి ఆయన ఈరోజు ప్రసంగించారు. ఇటీవలే మూడవసారి ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశానని, మూడు రెట్ల వేగంతో పనిచేయాలని అనుకుంటున్నానని తెలిపారు. తాను ఒక్కడినే ఇక్కడికి రాలేదని.. 140 కోట్ల మంది భారతీయుల ప్రేమాభిమానాలను వెంట తీసుకువచ్చానని ప్రధానమంత్రి వివరిస్తూ..

వాయిస్ (33 సెకన్లు)

---

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన వెలగపూడి సచివాలయంలో రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం జరుగుతోంది. ప్రధానంగా వ్యవసాయ రుణాలు, సంక్షేమ పథకాల అమలు, రుణ లక్ష్యాలపై సమావేశంలో చర్చించనున్నారు. అనంతరం విద్యుత్‌శాఖపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబబాఉ నాయుడు శ్వేతపత్రం విడుదల చేయనున్నారు. రాష్ట్రంలో ఇసుక విధానంపైనా ప్రభుత్వం ఈ రోజు శ్వేతపత్రం విడుదల చేయనుంది.

---

ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలు ఈ నెల 22వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. తొలి రోజు ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ప్రసంగించనున్నారు. తర్వాత రోజుల్లో గవర్నర్ ప్రసంగంపై చర్చ, ధన్యవాద తీర్మానాన్ని ప్రవేశపెట్టనున్నారు. ఎన్నికలకు ముందు గత ప్రభుత్వం నాలుగు నెలలకు ప్రవేశపెట్టిన ఓటాన్ ఎకౌంట్ బడ్జెట్ ఈ నెల 31వ తేదీ వరకు అమల్లో ఉంటుంది. ప్రస్తుతం ఏ పథకాలను ఎప్పుడు, ఎలా అమలుచేయాలనే అంశాలపై ప్రభుత్వం చేస్తున్న కసరత్తు పూర్తయితే బడ్జెట్‌పై స్పష్టత రానుంది. అందువల్ల మరో మూడు నెలలకు తాత్కాలిక బడ్జెట్ కోసం ఆర్డినెన్స్ తీసుకువచ్చే అవకాశం ఉంది.

---------------------------

కృష్ణానది పరివాహక ప్రాంతంలోని ప్రాజెక్టులను కృష్ణానదీ నిర్వహణ బోర్డు.. కేఆర్ఎంబీ పరిధిలోకి తీసుకువచ్చే అంశంపై సుప్రీంకోర్టు ఈ రోజు విచారణ చేపట్టింది. శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల నుంచి విద్యుత్ ఉత్పత్తి, ఇతర అవసరాలకు అనుమతులు లేకుండా నీటిని వినియోగిస్తున్న విషయంపై ఆంధ్రప్రదేశ్ గతంలో పిటిషన్ దాఖలు చేసింది. ఆ పిటిషన్‌ను జస్టిస్ అభయ్ ఎస్ ఒఖా, జస్టిస్ అగస్టీన్ జార్జి మాసి నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం నుంచి తగిన ఆదేశాలు తీసుకుని తాజాగా అఫిడవిట్ దాఖలు చేస్తామని అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటియా న్యాయస్థానానికి తెలిపారు. కృష్ణా పరివాహక ప్రాజెక్టులను కేఆర్ఎంబీ పరిధిలోకి ఇవ్వడం తమకు సమ్మతమేనని ఆంధ్రప్రదేశ్ గతంలోనే తెలుపగా... ఇదే అంశంపై విముఖత వ్యక్తం చేస్తూ తెలంగాణ ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసింది. ఇరువైపులా వాదనలు విన్న అత్యున్నత న్యాయస్థానం తదుపరి విచారణను ఆగస్టు 20వ తేదీకి వాయిదా వేసింది. ఆ లోపు అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది.

---------------------------

ఉపాధ్యాయ అర్హత పరీక్ష.. టెట్‌కు 90 రోజుల సమయం ఇచ్చినందున షెడ్యూల్‌ను మార్పు చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దరఖాస్తుల సమర్పణకు, రుసుము చెల్లింపునకు ఆగస్టు 3వ తేదీ వరకు అవకాశం కల్పించింది. నమూనా పరీక్షలను సెప్టెంబరు 19వ తేదీ నుంచి అందుబాటులో ఉంచనుంది. అదే నెల 22వ తేదీ నుంచి హాల్‌టికెట్లు అందుబాటులోనికి తేనుంది. టెట్ పరీక్షలను అక్టోబరు 3 నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తారు. తుది కీని 27వ తేదీన, ఫలితాలు నవంబరు 2వ తేదీన విడుదల చేస్తారు.

---------------------------

దేశంలో ఖరీఫ్ సాగు విస్తీర్ణం గత ఏడాదికంటే 14.10 శాతం పెరిగిందని కేంద్ర వ్యవసాయశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. జులై 8వ తేదీ నాటికి గత ఏడాది 331.90 లక్షల హెక్టార్లలో పంటలు సాగు కాగా, ఈ ఏడాది 378.72 లక్షల హెక్టార్లకు పెరిగిందని వెల్లడించింది. వరి సాగు విస్తీర్ణం 50.26 లక్షల హెక్టార్ల నుంచి 59.99 లక్షల హెక్టార్లకు, పప్పుదినుసులు 23.78 లక్షల హెక్టార్ల నుంచి 36.81 లక్షల హెక్టార్లకు, నూనెగింజలు 51.97 లక్షల హెక్టార్ల నుంచి 80.31 హెక్టార్లకు, చెరకు 55.45 లక్షల హెక్టార్ల నుంచి 56.88 లక్షల హెక్టార్లకు, పత్తి 62.34 లక్షల హెక్టార్ల నుంచి 80.63 లక్షల హెక్టార్లకు పెరిగాయని తెలిపింది. చిరుధాన్యాల సాగు మాత్రం 82.08 లక్షల హెక్టార్ల నుంచి 58.48 లక్షల హెక్టార్లకు తగ్గిందని కేంద్ర వ్యవసాయశాఖ వెల్లడించింది.

---------------------------

దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లో మూడవ లైన్ పనుల్లో భాగంగా రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడనుంది. పూర్వ నాన్ ఇంటర్ లాకింగ్, ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా ఈ మేరకు నిర్ణయం తీసుకున్నామని

అధికారులు తెలిపారు. డివిజన్ పరిధిలో విజయవాడ, గూడూరు సెక్షన్‌లో పలు రైళ్లను రద్దు చేయడంతో పాటు మరికొన్నింటిని దారి మళ్లిస్తున్నామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఆగస్టు 5వ తేదీ నుంచి 10వ తేదీ వరకు విశాఖ–కడప, ఆగస్టు 6వ తేదీ నుంచి 11వ తేదీ వరకు కడప–విశాఖ మధ్య నడిచే తిరుమల ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేశామని వివరించారు.

---------------------------

ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలోని నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్.. ఎన్టీటీపీఎస్ ఐదో దశలో గత అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో ఓ ఉద్యోగి, కాంట్రాక్టు కార్మికుడికి తీవ్రగాయాలయ్యాయి. ఎన్టీటీపీఎస్ ఐదో దశలో బాయిలర్ ఆగిపోవడంతో కార్మికులు మరమ్మతులు చేస్తున్న సమయంలో బూడిద నిల్వ తలుపులు తెరుచుకున్నాయి. దీంతో మంటలు చెలరేగాయి. వేడి బూడిద తాకిడికి ఒక ఉద్యోగి, కాంట్రాక్టు కార్మికుడికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స కోసం గొల్లపూడిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి అధికారులు తరలించారు. కాగా.. ఈ ప్రమాదంపై ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర విచారం వ్యక్తం చేశారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

---------------------------

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 16వ తేదీ సాలకట్ల ఆణివార ఆస్థానాన్ని పురస్కరించుకుని ఈ రోజు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. సంవత్సరంలో నాలుగుసార్లు అంటే ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు వచ్చే మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. తిరుమంజనం అనంతరం ప్రత్యేక పూజ, నైవేద్యం కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆ తర్వాత భక్తులకు సర్వదర్శనం ప్రారంభించారు. ఈ సందర్భంగా అష్టదళ పాద పద్మారాధన సేవను టీటీడీ రద్దు చేసిందని దేవస్థానం కార్యనిర్వహణాధికారి జె.శ్యామలారావు పాత్రికేయులకు తెలిపారు.

---------------------------

విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గ అమ్మవారిని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు ఈ రోజు దర్శించుకున్నారు. వేద పండితులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించిన తర్వాత ఆశీర్వచనం చేశారు. అనంతరం అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎం.వెంకట్రావు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 18 సెకన్లు....

=====================